సంక్షేమం అందాలంటే జగనే కావాలి



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఆనంద్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- యల్లపువానిపాలెంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే...'

గోపాలపట్నం: సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. యల్లపువాని పాలెం 461 సచివాలయం పరిధిలో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. తొలుత సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బ్యానర్ ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి నాగేంద్రకాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆనంద్‌కుమార్ మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 99శాతం నెరవేర్చారన్నారు. పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు పడేలా సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్న లక్ష్యంతో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఇపుడు పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు, కార్పొరేట్ స్థాయి విద్యను పేదలకు అందిస్తున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమం ఎక్కడా ఆగలేదని తెలిపారు. నియోజకవర్గంలో 5 పీహెచ్‌సీలు ఏర్పాటు చేశామని తెలిపారు. మరికొన్ని కొత్తపీహెచ్‌సీలు నిర్మించేందుకు మంత్రి విడదల రజనికి ప్రతిపాదనలు అందించామని తెలిపారు. కొత్తపాలెంలో ఇటీవల పీహెచ్‌సీ ప్రారంభించి ఈ ప్రాంత వాసులకు వైద్యసేవలు దగ్గర చేశామని చెప్పారు. యల్లపువానిపాలెం సచివాలయం పరిధిలో రూ.17.39కోట్లు నిధులు వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించామని వివరించారు.

మోసకారి మాటలు నమ్మొద్దు

గతంలో మోసం చేసిన వారు మళ్లీ మీ ముందుకు వస్తున్నారు జాగ్రత్తగా ఉండాలని కోరారు. బాబును ముఖ్యమంత్రి చేసేందుకు పవన్ బాబు పచ్చకండువా మోసే కాంట్రాక్ట్ తీసుకున్నాడని దుయ్యబట్టారు. జగన్ చేసిన మంచిని. సంక్షేమాన్ని సామాజిక న్యాయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.

పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఏ రహమాన్ మాట్లాడుతూ ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనపై మంచి అభిప్రాయం ఉందన్నారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారని తెలిపారు. పశ్చిమంలో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ స్పీడ్ పెరిగిందని ..సైకిల్ షెడ్‌కు వెళ్లిపోతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఏపీడీ శ్రీరామ్, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు,క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, షేక్ రహమాన్, అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: వార్డుల్లోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని పార్టీ ముఖ్య నాయకులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచించారు. తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వార్డుల్లో తాను పర్యటించే సమయంలో ప్రజలు తన దృష్టికి సమస్యలు తీసుకురాకుండా ముందుగానే వాటిని తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రభుత్వం నుంచి ఇంకా మేలు చేకూరే పనులు ఏమైనా ఉన్నాయో అనే విషయాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు మెహరా భాస్కర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 60వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, జీవీఎస్ఎన్ రాజు(కేబుల్ వాసు), భోగవల్లి నాగభూషణం, చట్టి నూకరాజు, నూకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న మలేరియా అధికారి రవికుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో జోన్-5 మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతి శుక్రవారం డ్రై డేగా ఎందుకు పాటించాలి అన్న అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, పరిసరాల అపరిశుభ్రత తదితర సమస్యల వల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. వాటి వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఇంట్లో కొబ్బరి బొండాలు, వ్యర్థాలు, రబ్బర్ టైర్లు, నీటి కుండీలపై పైకప్పులు వేయకపోవడం వంటి కారణాల వల్ల దోమలు అక్కడ చేరి గుడ్లు పెట్టి వాటి సంతానాన్ని ఉత్పత్తి చేస్తాయన్నారు. ఇల్లు, ఇంటి చుట్టుపక్కల పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇంట్లో నీటి పాత్రలను ఖాళీ చేసి శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటే పోటీల విజేతలకు అభినందనలు



విజేతలతో కార్పొరేటర్ ముర్రు వాణి, మజ్జి నూకరాజుస్వామి

కంచరపాలెం: రాణాస్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం 57వ వార్డు ఐటీఐ జంక్షన్ హ్యాపీ హోమ్ సెమినార్ హాల్‌లో కరాటే పోటీల విజేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల షాదీఖానాలో నిర్వహించిన 9వ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో 26 పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్‌లను ముఖ్య అతిథి కార్పొరేటర్ ముర్రు వాణి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు మెమొంటోలు అందజేశారు. పోటీల్లో 5 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్, 15 బ్రాంజ్ మెడల్స్ గెలుపొందినట్లు సీనియర్ కరాటే మాస్టర్ ఎస్.పి.ఎం.డి.నాయుడు, కోచ్ సాయి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మజ్జి నూకరాజుస్వామి, ఎ.మధు, సుధాకర్, అప్పలనరసయ్య, సాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వర్ల ఉత్సవాలకు శ్రీకారం



పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అశోక్‌నగర్ గౌరీపరమేశ్వరి ఆలయం వద్ద గౌరీపరమేశ్వర్ల ఉత్సవాలకు శుక్రవారం పందిరి రాట వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి శరగడం పత్నిరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో గౌరీపరమేశ్వర్ల ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, డిసెంబర్ 16 వరకు ఇవి జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల నెల రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



ములకలపల్లి ప్రకాష్

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు బీజేపీ నాయకుడు, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ములకలపల్లి ప్రకాష్ ఉభయ గోదావరి జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

16న పెన్షనర్ల సమస్యలపై నిరసన



మాట్లాడుతున్న యు.వి.ఎస్.ఎన్.వర్మ

మల్కాపురం: పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 16న మత్రిపాలెం పీఎఫ్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీఆర్‌పీఏ సంఘం జిల్లా నాయకుడు యు.వి.ఎస్.ఎన్.వర్మ పిలుపునిచ్చారు. 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్‌ను రూ.9 వేలు చేయాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, డీఏ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్క పింఛన్‌దారుడికి హయర్ పెన్షన్ వర్తింపజేయాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు ప్రయాణించే రైలు టికెట్‌లో రాయితీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో తమ్మారావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అనర్హులుంటే ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

మల్కాపురం: ఓటరు జాబితాలో అనుర్హుల పేర్లు ఉంటే వాటి తొలగింపు కోసం అధికారులకు దరఖాస్తులు అందజేయాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సూచించారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల బీఎల్ఏలతో 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో పలు వార్డుల్లో గల బూత్ లెవల్ ఏజెంట్‌లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి,ఆ ఇంట్లో ఉన్న వారి వివరాలను పరిశీలించాలన్నారు. చాలా మంది ఆ ఇంటి చిరునామాలో లేకున్నా జాబితాల్లో పేర్లు ఉంటున్నాయని,వాటిని గుర్తించి వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. జాబితాల పరిశీలనలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. సమగ్ర సర్వే చేపట్టి అర్హులైన ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్‌లు గుండపు నాగేశ్వరరావు,కొణతాల సుధ,బల్లా లక్ష్మణరావు,మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్,నాయకులు పిలక రామ్మోహన్‌రెడ్డి, భోగవల్లి నాగభూషణం,భీశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు 11 ఫిర్యాదులు

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 11 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి 11 మంది ఫోన్ చేసి డిపో మేనేజర్ వి.ప్రవీణకు పలు సమస్యలను తెలియజేశారు. ముందుగా అక్కిరెడ్డిపాలేనికి చెందిన రాధాకృష్ణ అనే వ్యక్తి 38 రూట్ బస్ సర్వీస్‌ను గంట్యాడ నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు నడిపించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎం ప్రవీణ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో తాము ఒకసారి పరిశీలించి, అక్కడ బస్ సర్వీస్ అవసరమనుకుంటే తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇలా పలువురు తమకు అవసరమైన బస్ సర్వీస్‌లపై విన్నవించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుడి కుటుంబానికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురానికి చెందిన సామంతుల వెంకటరావు అనారోగ్య రీత్యా గురువారం రాత్రి మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులను శుక్రవారం కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు పరామర్శించారు. వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయం కింద మృతుడి నామినీ మోహినికి రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పరిహారం తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేశామని, మిగిలిన రూ.90 వేల మృతుడి నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరూ ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ శేఖర్, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడుదాం



మూఢనమ్మకాలపై ప్రదర్శనలో సన్నివేశం



మాట్లాడుతున్న డీఎస్‌వో ప్రసాద్



ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం హెప్సిబా

- గోపాలపట్నం పాఠశాలలో నేషనల్ సైన్స్ డ్రామా ఫెస్టివల్
- ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు

గోపాలపట్నం: మూఢనమ్మకాలను విడనాడుదాం ... శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించుకుందామంటూ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. బెంగళూరుకు చెందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డ్రామా ఫెస్టివల్ -2023 కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి పోటీలు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో కె. ప్రసాద్ మాట్లాడుతూ మూఢనమ్మకాల వల్ల కలిగే అనర్థాల గురించి, శాస్త్ర విజ్ఞానాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. హెచ్ఎంలు ఎస్తేర్ హెప్సిబా, వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత,శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంచేందుకు ఇది దోహదపడుతుందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో 8 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వీరు మిలెట్స్ దా సూపర్ ఫుడ్, ఫుడ్ సెక్యూరిటీ, మోడరన్ టెక్నాలజీ ఇన్ డైలీ లైఫ్, బెస్ట్ ఫ్రెండ్, మహిమ గల మరచెంబు, మూఢనమ్మకాలు, నవ చైతన్యం, మూఢనమ్మకాలు వీడండి వంటి స్కిట్లు ప్రదర్శించారు. ఈ పోటీల్లో గోపాలపట్నం బాలికల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నవచైతన్యం స్కిట్‌కు ప్రథమ బహుమతి పొందింది. వీరిని నిర్వాహకులు, పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీపీ కోఆర్డినేటర్ కె. బాబూరావు, రిజోర్స్ పర్సన్ సీహెచ్ గిరివర ప్రసాద్, డీఎస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 54 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. సుమారు 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 275 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 156 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 54 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు. నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జ్ఞానవంతుల కన్నా.. అనుభవశాలి మిన్న



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కంచరపాలెం: సమాజంలో పది మంది జ్ఞానవంతుల కన్నా.. ఒక్క అనుభవశాలి మేలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్ అంబేడ్కర్ గ్రంథాలయంలో ఉత్తరాంధ్ర సామాజిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామాలు, మురికివాడల్లో ప్రాథమిక చికిత్సలపై ప్రజా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు ప్రక్రియ జరగాలంటే ప్రజాబలం ప్రభుత్వాలకు తెలియాలన్నారు. మన జీవనశైలి, ఆహార నియమాలు సక్రమంగా పాటిస్తే ఎటువంటి రోగాలు రావన్నారు. ఉత్తరాంధ్ర ఆర్ఎంపీ సంఘం అధ్యక్షుడు జంగం జోషి, కలాం, ఎం .తిరుపతిరావు, ఎ.శ్రీనివాసరావు, కోన ప్రకాష్, స్థానిక ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

కాశీ రైలు కంచికేనా..?



ఏప్రిల్‌లో ప్రారంభించిన కాశీ వీక్లీ స్పెషల్ ట్రైన్ (ఫైల్)

- అట్టహాసంగా ప్రారంభించారు.. పొడిగింపు మరిచారు
- ఇప్పటికీ పట్టాలెక్కని మరో రైలు

తాటిచెట్లపాలెం: ఈ ఏడాది ఏప్రిల్ వరకు కాశీకి రైలు లేదని ఉత్తరాంధ్ర వాసులు బాధపడేవారు. ఎట్టకేలకు ఏప్రిల్‌లో కాశీకి వీక్లీ స్పెషల్ రైలు మంజూరై పట్టాలెక్కింది. విశాఖపట్నం-బనారస్-విశాఖపట్నం (08588/08587) వీక్లీ స్పెషల్ రైలుగా విశాఖ నుంచి ప్రతీ బుధవారం బయలుదేరేది. అది కాస్తా వివిధ కారణాలతో మధ్యలో కొన్ని రోజులు నడిచేది, కొన్ని రోజులు రద్దయ్యేది. ఇది ప్రత్యేక రైలు కావడంతో దీని కాలపరిమితి అక్టోబర్ 26తో ముగియడంతో పూర్తిగా నడవడం లేదు. ప్రస్తుతం కాశీ రైలు లేదు. ఇప్పటివరకు పొడిగింపు రాలేదు. భవిష్యత్తులో ఈ ట్రైన్ ఉంటుందా.. ఉండదా అని ప్రయాణికుల్లో, ఉత్తరాంధ్ర వాసుల్లో ఒకటే ఆందోళన. ఈ రైలు ద్వారా డైరెక్టుగా కాశీకి చేరుకునే ప్రయాణికులు ఎంతో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని సాగించేవారు. ఇది కాస్తా లేకపోవడంతో మళ్లీ పాత కష్టాలు మొదలయ్యాయి.

ఇలాగే మరో రైలు కథ..

వారణాసి-సంబల్‌పూర్-వారణాసి (18312/18311) రైలును విశాఖపట్నం వరకు పొడిగిస్తున్నట్లు స్వయానా రైల్వే మంత్రి సెప్టెంబర్ 25న ప్రకటించడం, ఆయనకు జేజేలు పలకడం జరిగాయి ఈ ప్రకటన చేసి సుమారు నెలన్నర కావస్తున్నా.. దీనిపై ఎటువంటి చర్యలు లేవు. ఇది ఎప్పుడు పట్టాలెక్కుతుందో.. విశాఖ వాసులు ఆశలు తీరేదెప్పుడో తెలియని పరిస్థితి. విశాఖపట్నం నుంచి వారణాసికి రెండు రైళ్లని మురిసిపోయాం. కానీ ఆ ఆనందం కేవలం కొద్ది రోజుల్లోనే ఆవిరైంది. సంబంధిత అధికారులు స్పందించి విశాఖ నుంచి నడిచే వీక్లీ స్పెషల్ రైలును కొనసాగించాలని, సంబల్‌పూర్ రైలును కూడా విశాఖ వరకు పొడిగించి వెంటనే పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర, విశాఖ వాసులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 12 మందికి 2వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు రూ.33 వేల జరిమానాలు విధించింది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్, సప్తగిరి జంక్షన్, బాజీ జంక్షన్ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 12 మందిపై కేసులు నమోదు చేశారు. శక్రవారం వీటి విచారణ జరిపిన 2వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు మరో నిందతుడు రాపర్తి సన్యాసిరావుకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు సహించం

మహారాణిపేట: రేషన్ సరకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావుతో కలిసి ఆయన నగరంలోని పలు రేషన్ డిపోలు, రేషన్ సరకుల పంపిణీ వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా కంచరపాలెం ఏరియాలో రేషన్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేసి, బియ్యం స్టాక్ ఎంత వచ్చింది, ఎంత పంపిణీ చేశారు? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్డుదారులతో మాట్లాడి రేషన్ పంపిణీలో సమస్యలపై ఆరా తీశారు. అనంతరం షీలానగర్‌లోని రేషన్‌డిపోను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. మిందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, కోడిగుడ్ల రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఆయన స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్ పరిశీలించగా 1800 కోడిగుడ్లు అధికంగా ఉన్నాయని, హెచ్ఎం వివరణ తీసుకుని పంపాలని డీఈవోను లక్ష్మీరెడ్డి ఆదేశించారు. మల్కాపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం వడ్లపూడిలో ఎంఎల్ఎస్ గొడౌన్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వోలు జి.మురళీనాథ్, టి.కృష్ణ, సీడీపీవో నీలవేణి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఉమసుందరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సెమీస్‌కు బాలప్రణయ్, అపర్ణ

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



క్వార్టర్ ఫైనల్స్ పోటీల్లో తలపడుతున్న షట్లర్లు

విశాఖ స్పోర్ట్స్: 67వ రాష్ట్ర అంతర్ జిల్లాల ఎస్జీఎఫ్ బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ షట్లర్లు బాలప్రణయ్, అపర్ణ సెమీస్‌కు చేరుకున్నారు. అండర్-14 కేటగిరీలో బాలుర విభాగంలో చిత్తూరుకు చెందిన వేదవ్యాస్, బాలికల విభాగంలో అనంతపురానికి చెందిన నక్షత్ర సెమీస్‌లో ప్రవేశించారు. ఇక్కడి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన వ్యక్తిగత పోటీల్లో సత్తా చాటారు. ఎస్జీఎఫ్ విశాఖ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్-14, 17 బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అండర్ 14 బాలుర విభాగంలో జి.ఎస్.వేదవ్యాస్(చిత్తూరు), ఎస్. మురారివెంకట్(అనంతపురం), కె.ఈశ్వరసాయి(అనంతపురం), ఎం.కృష్ణకార్తీక్(తూర్పుగోదావరి) సెమీస్‌కు చేరుకున్నారు. బాలికల విభాగంలో జె.నక్షత్ర, డి.యజ్ఞశ్రీ(అనంతపురం), డి.ఆశశ్రీ(ప్రకాశం), ఆర్.యశ్విత(కర్నూలు) సెమీస్‌లో ప్రవేశించారు. అండర్-17 బాలురలో పి.బాలప్రణయ్(విశాఖ), ఎ.త్రిలోక్(పశ్చిమ గోదావరి), కె.ఎస్ వెంకటప్రణీత్(తూర్పుగోదావరి), టి.నిఖిల్ ప్రకాష్(కర్నూలు, బాలికల్లో అపర్ణ(విశాఖ), ఎన్.సౌమ్యశ్రీ(తూర్పుగోదావరి), సీహెచ్ భవితశ్రీ(పశ్చిమగోదావరి), బి.హర్షిత(విశాఖ) సెమీస్‌లోకి దూసుకెళ్లారు.